క్లుప్తంగా

కార్యకర్తలకు న్యాయం చేయాలి


సీఎం చంద్రబాబు నాయుడుతో గోవర్ధన్ రెడ్డి, హరి ప్రసాద్

కడప రూరల్ : కార్యకర్తలకు న్యాయం చేయాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్ రెడ్డి, హరిప్రసాద్ కోరారు. విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును గురువారం వారు కలిశారు. వారు మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం జిల్లాలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

మా డివిజన్‌లో సమస్యలను పరిష్కరించండి


కమిషనర్ మనోజ్‌రెడ్డికి మొక్క అందజేస్తున్న కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : మా డివిజన్లలో సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్లు పాకా సురేష్ కుమార్, బాలస్వామిరెడ్డి, ఎస్ఎ.షంషీర్‌లు కడప నగరపాలక సంస్థ నూతన కమిషనర్ మనోజ్‌రెడ్డికి గురువారం విన్నవించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో ఆయనను కలిసి మొక్క అందజేశారు. అనంతరం డివిజన్ సమస్యలను వారు విన్నవించారు.

ఫిట్స్ రావడంతో బస్సును ఢీకొని..


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ అమర్‌నాథరెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరం పాత బస్టాండు సమీపంలో మహమ్మద్ గౌస్ అనే యువకుడు మోటారు సైకిల్‌పై డ్రైవ్ చేస్తూ పాత బస్టాండు సమీపంలో నిలబడిన ఆర్టీసీ బస్సును ఢీకొన్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. మీడియాలో బైక్ విన్యాసాలు చేసి ఆర్టీసీ బస్సును ఢీకొన్నారని వచ్చిన వార్తలో వాస్తవం లేదన్నారు. ఈ విషయంపై విచారించగా మోటారు సైకిల్ డ్రైవ్‌చేసే సమయంలో గౌస్‌కు ఫిట్స్ రావడంతో కంట్రోల్ తప్పి బస్సును ఢీకొన్నాడన్నారు. గౌస్‌కు లైసెన్సు లేకపోవడంతో వారి పెద్దలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా విధించామన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వార్డుల్లో కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న సీఐటీయూ నాయకులు

కడప కార్పొరేషన్ : నగరపాలక సంస్థలో పనిచేస్తున్న శాశ్వత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) నగర అధ్యక్షుడు సుంకరరవి డిమాండ్ చేశారు. నగరంలోని పలు డివిజన్లలో గురువారం ఆయన పర్యటించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కార్మికులపై వార్డు శానిటరీ సెక్రటరీల వేధింపులు ఎక్కువయ్యాయని, గూగుల్ మస్టర్, రిటర్న్ మస్టర్ అని ఇబ్బందిపెడుతున్నారని తెలిపారు. ఉరుకు పరుగులపై ప్రయాణాలు చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పర్మినెట్ వర్కర్లలో రిటైర్‌మెంట్, వయసు ఎక్కువ ఉన్నవాళ్లు ఉన్నారని, వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలుచేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అందరికీ అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి డిమాండ్ చేశారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం దీపావళి నుంచి అమలు చేస్తామని చెప్పడం సంతోషకరమన్నారు. మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం దీపం, ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథక, తెల్ల రేషన్ కార్డు దారులకు ఇస్తామని చెప్పడం తగదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ నిలబెట్టుకోవాలన్నారు. విద్యా సంవత్సరం సగం పూర్తయినా విద్యార్థికి ఏడాదికి రూ.15,000 ఇవ్వలేదన్నారు. 'తల్లికి వందనం నిల్.. తండ్రికి ఇంధనం ఫుల్' అన్నట్లుగా ఉందన్నారు. కుళ్లాయప్ప, ప్రసాద్‌గౌడ్, అబ్దుల్ త్తార్, సిరాజుద్దీన్, సలావుద్దీన్, మొయినుద్దీన్‌లు పాల్గొన్నారు

ఆరోగ్య ఫలం.. వ్యాపారులకు వరం

సీతా ఫలం..ఆ పేరే మధురం. ఏడాదిలో ఒకసారి చలికాలంలో వచ్చే ఈ ఫలం.. కడప నగర వాసులను కమ్మగా పలకరిస్తోంది. పీలేరు తదితర ప్రాంతాల నుంచే వచ్చే నాటు సీతాఫలం అందరికీ పోషకాలను పంచుతోంది. బలవర్ధకమైన పదార్థాలు కలిగి ఉండడంతో ప్రజలు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- పీలేరు సీతాఫలంతో చిరు వ్యాపారులకు ఉపాధి
- కడప నగరంలోని పలు ప్రాంతాల్లో జోరుగా విక్రయాలు


కడప సీఎస్ఐ చర్చి వద్ద సీతా ఫలం విక్రయాలు

కడప రూరల్ : సీతాఫలం సీజన్ ప్రారంభమైంది. ఏడాదికోసారి చలికాలంలో లభించడం ఈ పండ్ల ప్రత్యేకత. అక్టోబరు నుంచి జనవరి వరకు ఈ ఫలం పుష్కలంగా దొరుకుతుంది. కడప నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఈ ఫలాలు లభిస్తున్నాయి. సీఎస్ఐ చర్చి వద్ద లభించే ఫలంపై నగర వాసులు మక్కువ చూపుతున్నారు. కడప నగరానికి ప్రధానంగా పీలేరు, ఇతర ప్రాంతాల నుంచి సీతాఫలం వస్తోంది. పీలేరులోని చిరు వ్యాపారులు స్వయంగా ఆ పండ్లను నగరానికి తెచ్చి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం కిలో రూ.70 నుంచి రూ.100 వరకు ధర పలుకుతోంది. చిరువ్యాపారాలు ఈ ఫలాల విక్రయాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

పోషకాలు మెండు..

సీతా ఫలంలో మెరుగైన ఆరోగ్యానికి కావాల్సిన పోషకాలు మెండుగా ఉన్నాయి. ఈ పండులో విటమిన్ ఎ, బి, సి, కె అలాగే ప్రొటీన్, కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం, కాపర్, ఐరన్ పుష్కలంగా లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే చక్కెర వ్యాధి వచ్చే అవకాశాలను ఇది తగ్గించడమేగాక, గుండె, అధిక రక్తపోటు వ్యాధులను నివారిస్తుంది. గాయాలు త్వరితగతిన నయమవుతాయి. దేహంలోని వ్యాధికారక క్రిములను తొలగించి కంటి చూపు మెరుగుపరుస్తుంది. మొటిమల నివారణకు, మలబద్ధకం నియంత్రణలకు ఇది ఉపయోగపడుతుంది. సీతా ఫలం పలు ప్రయోజనాలను కలగజేస్తుంది. అందువలన ప్రజలు ఈ పండుపై మక్కువ చూపుతున్నారు.

ఉపాధి పొందుతున్నాం..

పీలేరు ప్రాంతాల్లో సీతా ఫలాలు సేకరిస్తాం. ఏటా కడపకు తెచ్చి విక్రయిస్తుంటాం. నాతో పాటే చాలా మంది ఇక్కడికి వచ్చారు. మేమంతా సీతా ఫలాల ద్వారా ఉపాధి పొందుతున్నాం. వ్యాపారం ఫరవాలేదు. మూడు నెలలపాటు ఇక్కడే ఉంటాం.


- నాగమ్మ, పీలేరు

నాణ్యమైన పండ్లు లభిస్తున్నాయి

ఇక్కడ నాణ్యమైన సీతా ఫలాలు లభిస్తున్నాయి. ఈ సీజన్‌లో ఇంటిల్లిపాది ఈ పండ్లను తింటాం. వైద్యులు కూడా మంచి ఆరోగ్యానికి ఫలాలను తినమని సూచిస్తున్నారు. నగరంలోకి తెచ్చి విక్రయించడంతో సులువుగా కొనగలుగుతున్నాం.


- సుబ్బయ్య, పాత కడప, కడప

ఆరోగ్యానికి మేలు చేసే పండు..

సీతా ఫలంలో మెండుగా పోషకాలు లభిస్తాయి. మంచి ఆరోగ్యానికి ఉపయోగడే ఫలాల్లో సీతా ఫలం ఒకటి. ఫలాలు మెరుగైన ఆరోగ్యానికి దోహదపడుతాయి. విటమిన్లు ఇందులో పుష్కలంగా ఉంటాయి. ప్రతి ఒక్కరూ తీసుకోవచ్చు.


- బాలాజీ నాయక్, డైటీషియన్, రిమ్స్, కడప

ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి

యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కె.శారదాదేవి


మాట్లాడుతున్న కమిషనర్ శారదాదేవి

కడప స్పోర్ట్స్ : ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఏపీ యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కె.శారదాదేవి సూచించారు. నగరంలోని వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో 'వ్యక్తిత్వ వికాసం'పై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శారదాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లతో తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. యువత చదువు, క్రీడలు, కళలపై శ్రద్ధ వహించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. సెట్ సీఈఓ సి.సాయిగ్రేస్ మాట్లాడుతూ కడప నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో కమిషనర్ శారదాదేవిని యువజన సంఘాలు, స్వచ్ఛందసేవా సంస్థల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగమణి, స్టెప్ మేనేజర్ వి.వి.సుబ్బారాయుడు, నారాయణ, అబ్బాస్‌వలి, నాగయ్య పాల్గొన్నారు.

మంచి సంప్రదాయాలతోనే సమాజాభివృద్ధి

పవర్‌గ్రిడ్ డీజీఎం హరివెంకటకుమార్


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పవర్‌గ్రిడ్ అధికారులు

వైవీయూ : ఉన్నత ప్రవర్తన, నైతిక విలువలు, మంచి సంప్రదాయాలతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని పవర్‌గ్రిడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.హరివెంకటకుమార్ పేర్కొన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా గురువారం సీకే.దిన్నె మండల పరిధిలోని జె.కొత్తపల్లి, బొడెద్దులపల్లి ఉర్దూ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, భవిష్యత్ సమాజం ఉత్తమంగా రూపొందాలంటే బాగా చదివి అభివృద్ధిలోకి రావాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పవర్‌గ్రిడ్ అధికారులు పి.విజయరాజశేఖర్, ఎం. ప్రమోద్, ఎం.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి


డైరెక్టర్ ఆఫ్ ట్రెజరర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

కడప ఎడ్యుకేషన్ : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగులకు బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాష్‌బాషా, సంగమేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. కడప కలెక్టరేట్‌లో నిర్వహించిన పెన్షన్ అదాలత్ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గతంలో డీఏ బిల్లులు చేసి మూడేళ్ల గడచినా, ఇంత వరకు నగదు చెల్లింపులు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2018 జులై నుంచి 2019 జనవరి డీఏకు సంబంధించిన ఉత్తర్వులిచ్చి రెండు డీఏలను ఆరు విడతలుగా 2021వ సంవత్సరంలో బిల్లులు చేసుకోవాలని షెడ్యూల్ ఇచ్చిందన్నారు. ఇప్పటికీ దాదాపు 30 శాతం మందికి పీఎఫ్ ఖాతాలకు నిధులు జమకాలేదన్నారు. పదవీ విరమణ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షన్ అర్డర్లలో పేర్లు, పుట్టినతేదీ, నామినీ, డీడీఏ వివరాల్లో చిన్న చిన్న తప్పిదాలు చూపుతూ వెనక్కి పంపాల్సి రావడంతో ఆలస్యమవుతోందన్నారు. పెన్షన్ అర్డర్లు ఉద్యోగుల చేతికి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డైరెక్టర్ ఆఫ్ ట్రెజరర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకులు జయరామయ్య, కడప నగరశాఖ అధ్యక్షుడు సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం, పీఈటీలు వెంకటేశ్వర్‌రెడ్డి, అగ్గిరప్ప


ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన వివేకానందతో హెచ్‌ఎం పుష్పకుమారి, పీఈటీ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : ఈ నెల 22, 23వ తేదీలలో జరిగిన క్రికెట్, ఖోఖో, కబడ్డీ జిల్లా స్థాయి పోటీలలో కడప అంగడి వీధి జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-14 క్రికెట్‌లో మోక్షజ్ఞగౌడ్, అండర్-14 బాలుర ఖోఖోలో యువరాజ్, అండర్-14 బాలికల కబడ్డీ పోటీలలో మరియం ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబర్ 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు కోనసీమ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని వ్యాయామోపాధ్యాయుడు అగ్గిరప్ప తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డి, పీఈటీ అగ్గిరప్ప విద్యార్థులను అభినందించారు.

ఫుట్‌బాల్ పోటీలకు..

కడప గాంధీ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థి వివేకానంద అండర్-14 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ చాటారని, ఈ నెల 24, 25వ తేదీ లలో హిందూపురంలో జరిగే నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో వివేకానంద పాల్గొంటారని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థి వివేకానందను హెచ్‌ఎం పుష్పకుమారి, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్యమేరీ, రమేష్, ప్రసాద్, తదితరులు అభినందించారు.

● నగరంలో దీపావళి శోభ

దీపావళి పండగకు మట్టి, టెర్రకోట దీపాల ప్రమిదల విక్రయాలు జోరందుకున్నాయి. బెంగళూరు, చెన్నై, జిల్లా పరిధిలో తయారుచేసిన మట్టి ప్రమిదలను నగరానికి తెచ్చి విక్రయిస్తున్నారు. చిన్న దీపాలు డజన్ రూ.25-50 వరకు, మధ్య రకం రూ.60-80, పెద్దవి రూ.80-120 వరకు పలుకుతున్నాయి. కొన్ని చోట్ల కళాత్మకమైన ప్రమిదలు కనిపిస్తున్నాయి.

– కడప కల్చరల్


విక్రయాలకు సిద్ధంగా ప్రమిదలు

అభివృద్ధి పనులు వేగవంతం

నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి


కాలనీల్లో సమస్యలు తెలుసుకుంటున్న నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా నగరంలోని నకాష్, అల్మాస్‌పేట సర్కిల్, రైతు బజార్, పక్కీరిపల్లె, ఆర్టీసీ కాలనీ, అశోక్ నగర్ ప్రాంతాలను గురువారం ఆయన పరిశీలించారు. ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్, కేసీ కాల్వ, రైతుబజార్ల వద్ద చెత్తను శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. పార్కును ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అల్మాస్‌పేట సర్కిల్ నిర్మాణం, పెయింటింగ్, గ్రాస్ అమరికల పనులను వేగంగా పూర్తిచేయాలన్నారు. ఫక్కీరుపల్లె- ఆర్టీసీ కాలనీ మార్గంలో రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అశోక్ నగర్‌లో స్పీడ్ బ్రేకర్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈకిరణ్, ఏఈ స్వరూప, సునీల్, ఇరామియా, సిబ్బంది పాల్గొన్నారు.

బేడ బుడగ జంగాలకు న్యాయం చేయాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : బేడ బుడగ జంగాల సమస్యలను పరిష్కరించి సత్వరమే వారికి న్యాయం చేయాలని ఆ సంఘం కడప జిల్లా అధ్యక్షుడు దూపంరాజు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డిని గురువారం కలిసి బుడగ జంగాల సమస్యలను విన్నవించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర షెడ్యూల్ కులాల జాబితాలో తమ కులం ఉందని, 2002లో తెలంగాణ ప్రాంతానికే పరిమితం చేస్తే జీవో ఇచ్చారని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్‌లో నివసిస్తున్న బుడగ జంగాలు రిజర్వేషన్ హక్కు కోల్పోయి దీనస్థితిలో జీవిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ అడ్డుగా వున్న 144 జీవోను రద్దు చేసేలా గత క్యాబినెట్లో తీర్మానం చేశారని, త్వరలోనే సమస్య పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. సురేష్, మల్లి, లోకేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో యువత జీవితాలు సర్వనాశనం


ట్యాబ్లెట్లు చూపుతున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : గంజాయి, డ్రగ్స్‌తో యువత జీవితాలు సర్వనాశనమవుతున్నాయని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి తెలిపారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులు, బాధితుల తల్లులతో కలిసి ఎమ్మెల్యే జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును ఆమె కలిసి సమస్య విన్నవించారు. విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రిస్కిప్షన్ లేకుండా పెయిన్ కిల్లర్స్ విక్రయిస్తున్నారని, కెమిస్టులు డబ్బుకు ఆశపడి ఇష్టానుసారంగా అమ్మడంతో యువత పాడైపోతుందన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. ఎస్పీ స్పందిస్తూ డ్రగ్స్, మత్తు పదార్థాలను నిరోధానికి తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారన్నారు.

పశుసంపద దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధానం

కడప అగ్రికల్చర్ : పశుసంపద అనేది దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత ప్రధానం అని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభంకానున్న పశుగణన సర్వేకు సంబంధించిన పోస్టర్లను తన కార్యాలయంలో ఎమ్మెల్యేతో పాటు జిల్లా పశుసంవర్థశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ, నోడల్ ఆఫీసర్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ అనుపమలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా జరిగే పశుగణన సర్వేను పక్కగా నిర్వహించాలన్నారు.

ప్రజా సమస్యలపై సమరశీల పోరాటం


సంస్మరణ సభలో మాట్లాడుతున్న జి.ఈశ్వరయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు చేయడమే సీపీఐ నాయకురాలు బషీరున్నీషాకు ఘన నివాళి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని పేర్కొన్నారు. నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో బషీరున్నీసా సంస్కరణ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బషీరున్నీషా, ఆమె భర్త సత్తార్‌తో కలిసి కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చి మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై ఉద్యమాలు చేశారన్నారు. పులివెందులలో మహిళా సమాఖ్య ఏర్పాటుచేసి పోరాడారన్నారు. ఆమె ఆశయాలు ముందుకు తీసుకుపోవడానికి సీపీఐ ఎప్పటికీ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తులసిరెడ్డి, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, చంద్ర, వెంకటశివ, వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహబూబ్ సుబహాని ఉరుసు


జెండాను ఊరేగిస్తున్న భక్తులు, నిర్వాహకులు

కమలాపురం : పట్టణంలోని పడమట వీధిలో వెలసిన హజరత్ మహబూబె సుబహాని, ఖుత్బే రబ్బాని, అబ్దుల్ ఖాదర్ జిలాని, దస్తగిర్‌స్వామి వారి ఉరుసు మహోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దస్తగిరి స్వామి దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ ముహమ్మద్ ఫైజుల్ గప్పార్ షా ఖాద్రి చేతుల మీదుగా ఉరుసు జెండా ఊరేగింపును ప్రారంభించారు. ఊరేగింపు పట్టణంలోని పురవీధుల గుండా మేళ తాళాలలతో దర్గా చేరుకుంది. ఊరేగింపు అనంతరం గంధం ఎక్కించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. పూల చాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు.

రంగు రంగుల ప్రపంచం


ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు సందర్భంగా ఇతర చిత్రకారులతో డాక్టర్ మాధవి (ఫైల్)


యోగి వేమన వర్శిటీలో సాధన చేస్తున్న యువ చిత్రకారులు

నేడు పికాసో జయంతి

కడప కల్చరల్ : చిత్ర కళ వర్ణమయ ప్రపంచం. మనసును దోచే రంగుల ఆవిష్కరణ. సృజనకు ప్రతీక. కలను కళగా మార్చే చిత్రమైన ప్రక్రియ. వంద పేజీల్లో చెప్పలేని విషయాన్ని ఓ చిత్రంతో చెప్పవచ్చు. ప్రజల్లో చైతన్యాన్ని, సామాజిక స్పృహను కల్పిస్తుంది చిత్రకళ. ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పికాసో జన్మదిన సందర్భంగా శుక్రవారం ప్రపంచ వ్యాప్తంగా చిత్రకారుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. పదునెక్కిన తమ కుంచెల అద్భుత ఆవిష్కరణలను ఒకచోట చేర్చి వాటి సామాజిక ప్రయోజనాన్ని చర్చిస్తారు. ఈ సందర్భంగా మనజిల్లా చిత్రకళా ప్రపంచం గురించి ప్రత్యేక కథనం.

జిల్లాలో చిత్రకళకు సంబంధించిన పునాదులు బలంగానే ఉన్నాయి. 15 వేల సంవత్సరాల నాటి ఆది మానవుడు గీసిన చిత్రాలు ముద్దనూరు చింతకుంట కొండలో ఇటీవల బయల్పడటమే ఇందుకు ఉదాహరణ. గండికోట, బద్వేల్, బి.మఠం, రాయచోటి జిల్లాల అటవీ ప్రాంతాల్లో కూడా ఇలాంటి చిత్రాలు వెలుగుచూశాయి. గండికోటలోని రఘునాథస్వామి ఆలయంలోని శిల్పాలకు సంబంధించి నాటి శిల్పులు గీసిన స్కెచ్‌లను ఆలయ గోడలపై నేటికీ చూడవచ్చు.

జిల్లాలో నిన్నటితరం నుంచే ఈ కళకు గుర్తింపు లభించింది. సీపీ బ్రౌన్ ఊహా చిత్రాన్ని గీసిన బుడుగుంటపల్లె వాసి మైనంపాటి సుబ్రమణ్యం ఎనలేని ఖ్యాతిని ఆర్జించారు. ఆ తర్వాత జేపీ వాట్‌కిన్స్, పీడీ బాలసుందరం, పంకజమ్మ దంపతులు, జమ్మలమడుగు వాసి జ్వాలా నరసింహులు ఉత్తమశ్రేణి డ్రాయింగ్ మాస్టర్లుగా ఈ రంగానికి కళను సంతరించి పెట్టారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వారి ప్రభావం గల వందలాది మంది నేడు చిత్రకారులుగా రాణిస్తున్నారు. కోడూరుకు చెందిన ఉదయగిరి శ్రీరాములు, జౌళిశాఖలో డిజైనర్‌గా పేరుగాంచారు. జిల్లాకు చెందిన సీనియర్ చిత్రకారుడు వెంకట రాయులు, కార్టునిస్టు పీవీ.రమణమూర్తి జిల్లాకు పేరు సాధించిపెట్టారు. బద్వేల్‌కు చెందిన జయన్న బ్రౌన్ కుడ్య చిత్రాన్ని, బ్రౌన్ శిల్పాన్ని రూపుదిద్దారు. విశిష్టమైన హంస రాష్ట్ర పురస్కారాన్ని సాధించారు.

వైవీయూతో కొత్త మలుపు

జిల్లాలో యోగి వేమన విశ్వవిద్యాలయం ఏర్పాటు కావడం, అందులో చిత్రకళ విభాగాన్ని నెలకొల్పడంతో జిల్లాలో నేటి తరం చిత్రకారుల ఒరవడి మొదలైంది. అంకితభావం గల ప్రముఖ చిత్రకారులు కోట మృత్యుంజయరావు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో ఈ విభాగంలో చేరే విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఆయన శిష్యగణం జాతీయ, అంతర్జాతీయ బహుమతులు సాధించి యూనివర్సిటీ ఖ్యాతిని చాటారు. ప్రస్తుతం ఆ విభాగంలో ఫ్యాకల్టీలు మనోహర్, వెంకటేశ్, చిన్నరాయుడు తదితరులు విశేషంగా రాణిస్తున్నారు.

చిత్రకారిణి డాక్టర్ మాధవి తొలిసారిగా జిల్లా స్థాయిలో ఆర్ట్ గ్యాలరీని కడప నగరంలో స్థాపించారు. వ్యయ ప్రయాసలు కోర్చి తొలి ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేసిన ఖ్యాతిని దక్కించుకున్నారు.